సాక్షి
పల్నాడు
మంగళవారం । 25 । మార్చి । 2025



కారు బోల్తా

పిడుగురాళ్లరూరల్: టైర్ పంక్చరై కారు బోల్తా పడిన సంఘటన పిడుగురాళ్ల మండలం కామేపల్లి బైపాస్‌పై సోమవారం జరిగింది. ఘటనలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి.



ఖురాన్ గ్రంథాలు అందజేత

పట్నంబజారు: పొన్నూరు రోడ్డులోని ఉమే హాజీ బాలిక్ బాణాత్ మదర్సాకు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా సోమవారం పవిత్ర ఖురాన్ గ్రంథాలను బహూకరించారు.



క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

రాజుపాలెం: క్షయరహిత గ్రామాలే లక్ష్యం కావాలని డాక్టర్ రవితేజ నాయక్ తెలిపారు. రాజుపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం టీబీ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
నరసరావుపేట	6.27	4.54
గుంటూరు	6.25	4.52
బాపట్ల	6.25	4.52

న్యూస్‌రీల్

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం

జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు




విజయపురిసౌత్: మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు అన్నారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదేశాలతో మాచర్ల మండలం అనుపు వద్ద కృష్ణా జలాశయంలోకి 10 లక్షల చేప పిల్లలను సోమవారం విడుదల చేశారు. అనంతరం సంజీవరావు మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత వారంలో సైతం 10 లక్షల చేప పిల్లలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అలి వలలతో చేపల వేట చేస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. మత్స్య సంపదను కాపాడుకోవాలని సూచించారు. ఎఫ్‌డీఓ టీపీఏ శ్రీనివాసరావు, అగ్రికల్చర్ ఏఓ జగదీష్, మత్స్యశాఖ తనిఖీ అధికారి వెంకట రమణ, గ్రామ మత్స్య సహాయకులు లీలావతి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

27న ఉప సర్పంచ్ పదవులకు ఎన్నికలు

నరసరావుపేట: జిల్లాలోని 17 మండలాల్లోని 44 గ్రామ పంచాయతీల ఉపసర్పంచ్ పదవులకు ఈనెల 27వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ఎంవీ భాస్కరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై మంగళవారం నరసరావుపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11గంటలకు ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమానికి సంబంధిత ప్రిసైడింగ్ అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 520.60 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 6,041 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నేడు గుంటూరులో న్యాయవాదుల విధుల బహిష్కరణ

గుంటూరు లీగల్: రంగారెడ్డి జిల్లా కోర్టులో ఇ.ఇజ్రాయిల్ అనే న్యాయవాదిని దారుణంగా హత్య చేసినందుకు నిరసనగా గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి సోమవారం పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి దారుణమైన సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలన్నారు.

రుక్మిణీ అలంకారంలో నృసింహుడు



మంగళగిరి: మంగళాద్రిలోని లక్ష్మీ నృసింహ స్వామి సోమవారం రాత్రి రుక్మిణీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆస్థాన అలంకారోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని తరించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో ఏ రామకోటి రెడ్డి ఉత్సవాన్ని పర్యవేక్షించారు. మంగళవారం స్వామి స్తంభోద్భవం అలంకారంలో దర్శనమివ్వనున్నారు.

అర్జీలు సత్వరం పరిష్కరించండి



ప్రజల సమస్యలు ఆలకిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- పీజీఆర్‌ఎస్‌లో 145 అర్జీలు స్వీకరణ

నరసరావుపేట: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో జేసీ గనోరే సూరజ్ ధనుంజయ, అధికారులతో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 145 అర్జీలను స్వీకరించారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి..



మేము లక్ష్మీపురం, కాకాని గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్లుగా పనిచేస్తున్నాం. మాకు రూ.12వేలు జీతమని ఆన్‌లైన్‌లో చూపిస్తుండగా కేవలం రూ.7వేలు మాత్రమే చేతికి అందుతున్నాయి. మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ ఏ సంక్షేమ పథకం ఇవ్వడం లేదు. ఒక్కో కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ లాంటి ప్రభుత్వ పథకాలు మాకూ అమలుచేస్తే ఆర్థికంగా బాగుంటుంది. దయచేసి సంక్షేమ పథకాలు అమలుచేయండి.

– లక్ష్మీప్రసన్న, రావూరి పద్మ, అంగన్‌వాడీ హెల్పర్లు

హైవే కోసం రోడ్డుకిరువైపులా భూసేకరణ చేయాలి



నరసరావుపేట మీదుగా వెళుతున్న అనంతపురం – అమరావతి నాలుగులైన్ల నేషనల్ హైవే 544డీ నిర్మాణంలో తమ గ్రామ పరిసరాల్లో ఉన్నరోడ్డుకు ఇరువైపులా భూసేకరణ జరిగితే ఎవరికీ నష్టం చేకూరదు. ప్రభుత్వానికి సైతం పరిహారం తగ్గుతుంది. ఒకవైపే వారికి కావాల్సిన భూమి సేకరిస్తే చాలామంది నష్టపోయే అవకాశం ఉంది.

– ప్రేమానందం, ఆర్‌కే పెద్దిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరావు, ఉప్పలపాడు గ్రామస్తులు

బెల్టుషాపులు తొలగించాలి

బొల్లాపల్లి మండలంతో పాటు జిల్లావ్యాప్తంగా మద్యం బెల్టుషాపులు తొలగించాలి. ఎగువ పల్నాడులో తాగునీరు దొరక్కపోయినా మద్యం మాత్రం విచ్చలవిడిగా దొరుకుతోంది. బెల్టుషాపులు ఊరూవాడా నిర్వహిస్తున్నా.. ఎక్సైజు, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే బెల్టుషాపులు నిర్మూలించి ఎన్నికల వాగ్దానాలను నిలబెట్టుకోవాలి.

– ప్రజాసంఘాల నాయకులు, బొల్లాపల్లి

తాగునీటి సౌకర్యం పునరుద్ధరించండి



లింగంగుంట్ల పంచాయతీ పరిధిలోని యానాది, బోయ కాలనీలలో 300 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గత 16ఏళ్ల నుంచి మాకు మంచినీటికి బజారు పంపులు ఏర్పాటు చేశారు. వాటి నుంచి తాగునీరు పట్టుకొని కాలం గడుపుతున్నాం. అయితే రెండు నెలల కిందట ఆ పంపులను తొలగించారు. అదేమంటే మున్సిపల్ నీరు పంచాయతీ పరిధిలోకి ఏ విధంగా ఇస్తామని అధికారులు మాట్లాడుతున్నారు. తాగునీటి సౌకర్యం కల్పించి మా కుటుంబాలను ఆదుకోవాలి.

– గంగుల పెద్దిరెడ్డి, చలంచర్ల పుల్లయ్య తదితరులు, బోయకాలనీ

40 మంది కార్మికులను తొలగించారు..



గత ఆరేళ్ల నుంచి నరసరావుపేట పురపాలక సంఘంలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్నాం. అప్కాస్‌లో మా పేర్లు నమోదయ్యాయి. పీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లిస్తున్నాం. మేం 30రోజులు పనిచేస్తున్నా మాకు రూ.6–7వేలే చెల్లిస్తున్నారు. మాకు రూ.21వేలు జీతం రావాల్సివుంది. అదేమని మున్సిపల్ కమిషనర్‌ను అడిగితే మీకు వచ్చేది అంతే, మీరు బదిలీ కార్మికులు, ఇష్టమైతే చేయండి, లేకపోతే మానుకోండి అంటూ 40మందిని ఆపేశారు. మళ్లీ విధుల్లోకి తీసుకొని పూర్తిజీతం చెల్లించాలి.

–షేక్ శిలార్, మున్సిపల్ కార్మికులు, నరసరావుపేట

'పౌడా' బడ్జెట్ అంచనాలకు ఆమోదం

జేసీ అధ్యక్షతన పౌడా ప్రత్యేక సమావేశం



కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న జేసీ, అధికారులు

నరసరావుపేట: పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (పౌడా) ప్రత్యేక సమావేశం సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్, పౌడా వైస్ చైర్మన్ గనోరే సూరజ్ ధనుంజయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా 2025–26 ఏడాదికి బడ్జెట్ అంచనాలతో పాటు జిల్లాలో చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. అలాగే 2024–25 ఏడాదికి సంబంధించిన ఖర్చులతో పాటు 2025–26 ఏడాది బడ్జెట్ అంచనాలను చర్చించి ఆమోదించినట్లు పౌడా కార్యదర్శి నవీన్‌కుమార్ వెల్లడించారు. అనంతరం నిర్వహించిన సాధారణ సమావేశంలో వైస్ చైర్మన్ ఎనిమిది అంశాలపై చర్చించి ఆమోదం తెలియచేశారని ఆయన స్పష్టం చేశారు. దీనిలో రీజినల్ డెప్యూటీ డైరక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ పి.మధుకుమార్, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఆర్.రాజానాయక్, జిల్లా టూరిజం అధికారి జి.నాయుడమ్మ హాజరయ్యారు.

భవిత ఫిజియోథెరపిస్టులకు ఇంటర్వ్యూలు..

కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో సోమవారం జేసీ గనోరే సూరజ్ ధనుంజయ్ భవిత ప్రత్యేక స్కూళ్లలో పనిచేసేందుకు ఫిజియోథెరపిస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం నాలుగు ఖాళీలు ఉండగా ఆరుగురు హాజరయ్యారు. డీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు, డీఎంహెచ్ఓ డాక్టర్ రవి, డీఈఓ ఎల్.చంద్రకళ, ఐఈటీ కో–ఆర్డినేటర్ ఆర్.సెల్వరాజ్‌లు ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అభ్యర్థులకు వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేయటం జరుగుతుందని తెలిపారు.

తిరుగు ప్రభల శోభ



విద్యుత్ వెలుగుల్లో శోభిల్లుతూ తిరుగు పయనమైన ప్రభ

దుర్గి: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ఆది, సోమవారాలు తిరునాళ్ల సందర్భంగా భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ గ్రామాల నుంచి పదుల సంఖ్యలో విద్యుత్ ప్రభలు ఆలయానికి వచ్చాయి. సోమవారం రాత్రికి తిరునాళ్ల పూర్తవగా, విద్యుత్ ప్రభలు ఆయా గ్రామాలకు తిరుగు పయనమయ్యాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ. 27.27లక్షలు

అడిగొప్పల నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి హుండీ కానుకలు లెక్కించగా రూ. 27,27,901 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి సైదమ్మ బాయి తెలిపారు. సోమవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కారంపూడి గ్రూప్ టెంపుల్స్ కార్యానిర్వాహణాధికారి కృష్ణంరాజు ఆధ్వర్యంలో లెక్కింపు జరిపామన్నారు. వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, ఎస్‌ఎంఆర్ సిబ్బంది, అర్చక, పరిచారక, నాయీ బ్రాహ్మణులు, భక్తులు పాల్గొన్నారు.



కృష్ణా జిల్లా శ్రీకాకుళం ఇసుక క్వారీ నుంచి గాలు మార్గం ద్వారా బాపట్ల జిల్లాలోకి ప్రవేశిస్తున్న ఇసుక లారీలు

హద్దులు దాటుతున్న ఇసుక

- కృష్ణా జిల్లాలో ఉచిత ఇసుక క్వారీ
- ఉమ్మడి గుంటూరు జిల్లాకు తరలింపు
- గాలు రోడ్డే అక్రమాలకు మార్గం
- పట్టించుకోని అధికారులు

కొల్లూరు: కూటమి నేతలు ఇసుకను అక్రమ మార్గంలో హద్దులు దాటిస్తున్నారు. అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కృష్ణా జిల్లా ఘంటసాల మండలం శ్రీకాకుళం ప్రాంతంలో ఉచిత ఇసుక క్వారీ ఉంది. యంత్రాలతో ఇసుకను భారీ లారీలలో నింపి దొడ్డిదారిలో బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలకు అక్రమంగా తరలిస్తున్నారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం గాజుల్లంక, కృష్ణా జిల్లా శ్రీకాకుళం గ్రామాల నడుమ వ్యవసాయ కార్యకలాపాలు, ప్రయాణికుల రాకపోకల కోసం ఏర్పాటు చేసిన గాలు మార్గం వారి అక్రమాలకు రాచమార్గంగా మారింది. రోజుకు 100 ఇసుక లారీలు అక్రమంగా తరలివెళుతున్నాయి.

బిల్లులు నిల్

నిబంధనల మేరకు రీచ్‌ల నుంచి ఇసుక రవాణా చేసే వాహనాలు రోడ్డు మార్గం ద్వారా ప్రయాణించి ఇతర జిల్లాల్లోకి సంబంధిత బిల్లులతో ప్రవేశించాల్సి ఉంది. అయితే ఉచిత ఇసుక క్వారీలను దక్కించుకున్న కూటమి నాయకులు ఎలాంటి బిల్లులు లేకుండానే బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలకు ఇసుకను యథేచ్ఛగా అక్రమంగా తరలిస్తున్నారు.

పట్టించుకోని యంత్రాంగం

కృష్ణా జిల్లా నుంచి నదిలోని గాలు మార్గం ద్వారా బిల్లులు లేకుండా ఇసుక అక్రమంగా జిల్లాలోకి వస్తున్నా అధికార యంత్రాంగం మాత్రం పట్టించుకోవడం లేదు. పగలు, రాత్రి తేడా లేకుండా అధిక సంఖ్యలో వాహనాలు గాజుల్లంక, పెసర్లంక, కొల్లూరు, పోతార్లంక, దోనేపూడి, కిష్కిందపాలెం, తోకలవారిపాలెం మీదుగా తరలి వెళుతున్నాయి. రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖల అధికారులు మాత్రం స్పందించడంలేదు. పెసర్లంక–కొల్లూరు రహదారి పనులు జరుగుతున్న తరుణంలో ఇసుక లారీల నుంచి భారీగా కారుతున్న నీరు కారణంగా రోడ్డు మన్నిక ప్రశ్నార్థకంగా మారుతుంది.



ఇసుక లారీల రాకపోకలతో దెబ్బతిన్న నూతనంగా నిర్మిస్తున్న పెసర్లంక-కొల్లూరు బీటీ రోడ్డు

కూలీల కడుపుకొడుతున్నారు

ఉచిత ఇసుక క్వారీలలో తవ్వకాలకు కూలీలను మాత్రమే వినియోగించాలన్న నిబంధనకు తూట్లు పొడుస్తున్నారు. ఉచిత ఇసుక క్వారీలను దక్కించుకున్న కాంట్రాక్టర్లు యంత్రాలను వినియోగిస్తున్నారు. నదిలో ట్రాక్టర్లు దిగి కూలీలతో ఇసుక నింపకుండా నది వద్ద అడ్డుగా గుంతలు తీసి అడ్డుకుంటున్న అధికారులు పక్క జిల్లా నుంచి అక్రమ మార్గంలో 40 టన్నుల ఇసుక రవాణా జరుగుతున్నా అడ్డుకునేందుకు ఎందుకు ప్రయత్నించడంలేదు. అధికారుల తీరుపై కార్మికులు మండిపడుతున్నారు.

పరిశీలించి చర్యలు..

నదిలో అక్రమ మార్గం ద్వారా జిల్లాలోకి ఇసుక రవాణాను అరికట్టే విషయంలో రూల్స్‌ను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. మైనింగ్ శాఖాధికారులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి కృష్ణా నదిలో జిల్లా దాటి బిల్లులు లేకుండా వాహనాలు వస్తే ఎటువంటి చర్యలు తీసుకోవాలన్న అంశాన్ని పరిశీలిస్తాం.

– బి.వెంకటేశ్వర్లు, తహసీల్దార్, కొల్లూరు

నాటకం.. మనుగడ పోరాటం

- కాలంతో పోరాటం.. పూర్వవైభవానికై ఆరాటం
- ఆధునికతను ఆహ్వానిస్తూ.. ప్రయోగాలతో పయనిస్తూ..
- ఈనెల 27న ప్రపంచ నాటక దినోత్సవం



నాటక ప్రదర్శన చేస్తున్న కళాకారులు

యడ్లపాడు: ప్రేమ, దుఃఖం, ఆశ, నిరాశ, విజయం, ఓటమి ఈ జీవన ఘట్టాలన్నింటినీ ఒకే వేదికపై ఆవిష్కరించే మహత్తర మాధ్యమం నాటకం. ప్రేక్షకుని మనస్సును హత్తుకునే హావభావాలు, ఆలోచనలను కదిలించే సంభాషణలు, సమాజాన్ని శుద్ధి చేసే కథావస్తువు, ఒక్క ప్రదర్శనలోనే గుండెల్ని కొల్లగొట్టే నిజజీవిత అనుభవం. ఇవన్నీ నాటక కళను విశిష్టంగా నిలబెడతాయి.

కావ్యేషు నాటకం రమ్యం..

భరతముని రచించిన 'నాట్యశాస్త్రం' నుంచి నేటి సాంకేతిక నాటక ప్రదర్శనల వరకు ఈ రంగం ఎన్నో మార్పులను స్వీకరించింది. రాజసభల నుంచి వీధి ప్రదర్శనల వరకు విస్తరించి, యక్షగానం, కూచిపూడి, భవాయి, ఒగ్గుకథల రూపంలో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసింది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో దేశభక్తి ప్రచార సాధనంగా మారింది. పాశ్చాత్య ప్రభావంతో ఆధునిక రంగస్థల నాటకాలు ఆవిష్కృతమయ్యాయి. నయా థియేటర్లు, కొత్త కథావస్తువులు రంగ ప్రవేశం చేశాయి. ప్రయోగాత్మక ప్రదర్శనలు వెలుగులోకి వచ్చాయి. పౌరాణిక, జానపద, సాంఘికంగా రూపాంతరం చెందాయి. భారతీయ కళలు 64 ఉన్నప్పటికీ 'కావ్యేషు నాటకం రమ్యం' అనే రమణీయ ఆర్యోక్తితో అగ్రస్థానంలో నిలిచింది.

అన్నింటికీ మూలం అదే..

టీవీ, సినిమా, వెబ్ సిరీస్, షార్ట్‌ఫిల్మ్, యాడ్స్, లైవ్‌షోస్, సినిమాలు వంటివి ఎన్ని వచ్చినా వాటికి మూలమైన నాటకం తన జీవాన్ని కోల్పోలేదు. ఎందుకంటే తెర వెనుక నటించిన నటుడిని మనం చూసే అవకాశం లేదు, కానీ రంగస్థలం మీద తడిసిముద్దయిన భావోద్వేగాలను ప్రత్యక్షంగా అనుభవించగలగే గంభీరత నాటక కళకు మాత్రమే సాధ్యం. డిజిటల్ ప్రాజెక్షన్స్, మల్టీమీడియా ఎఫెక్ట్స్, సౌండ్ డిజైన్, 3డీ లైట్ టెక్నాలజీ వంటి విభిన్న ప్రయోగాలతో నాటకం జవసత్వాలను తెచ్చుకుంటుంది. పరిషత్‌లు సైతం ప్రేక్షకుల్ని వేదిక వద్దకు తెచ్చేలా తమవంతు ప్రయత్నం చేస్తున్నాయి. ఎప్పుడో 1961 మార్చి 27న ప్రారంభమైన అంతర్జాతీయ రంగస్థల దినోత్సవం, నాలుగేళ్ల కిందటే షష్టిపూర్తి చేసుకుంది.

వేదికలపై ఇచ్చిన జీఓ వెనక్కి తీసుకోవాలి...



కూటమి ప్రభుత్వం స్కూళ్లలో ఉన్న రంగస్థల వేదికల వద్ద ఎటువంటి నాటక ప్రదర్శనలు ఇవ్వకూడదని జీఓ ఇవ్వడం బాధాకరం. దీనిని వెనక్కి తీసుకోవాలి. అంపశయ్యపై ఉన్న నాటక రంగాన్ని పరిషత్‌లే దాతల సాయంతో పునరుజ్జీవానికి కృషి చేస్తున్నాయి. ప్రభుత్వం సినీ పరిశ్రమపై చూపే ప్రేమ నాటకరంగంపై చూపడంలేదు. రంగస్థలాన్ని విస్మరిస్తోంది. పట్టణాలు, మండల కేంద్రాల్లో ఓపెన్ థియేటర్లను నిర్మించే దిశగా చర్యలు తీసుకోవాలి. కళాకారులకు అక్రిడిడేషన్‌తో పాటు పెన్షన్, ఇళ్లస్థలాలు మంజూరు చేసి భరోసా కల్పించాలి.

– డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు, వేదిక, పుచ్చలపల్లి సుందరయ్య కళాపరిషత్ అధ్యక్షుడు, యడ్లపాడు

స్వయంకృత అపరాధాలే అవరోధాలు



పరిషత్‌లను నాటకరంగానికి ఊపిరి అంటారు, కానీ అవి కేవలం ఉనికిని చాటుతాయి గానీ, అభివృద్ధికి దోహద పడడం లేదు. నాటక వికాసానికి ప్రధానంగా ప్రేక్షకాదరణ అవసరం. కొన్ని పరిషత్‌లు తమకిష్టమైన వ్యక్తులు, సమాజాలకు ఇచ్చే ప్రాధాన్యత మిగతావారికి ఇవ్వడం లేదు. నూతనత్వం, న్యాయ నిర్ణేతల్లో లోపించిన పారదర్శకత తదితర లోపాలతో యువత ఈరంగంపై ఆసక్తి చూపడం లేదు. పోటీ నాటికల స్థానంలో నాటకోత్సవాలను నిర్వహిస్తూ, ప్రభుత్వ ప్రోత్సాహాన్ని నిర్మాణాత్మకంగా తీర్చిదిద్దగలిగితే పూర్వవైభవం తథ్యం.

– అద్దేపల్లి భరత్‌కుమార్, నాటక రచయిత, హైదరాబాద్


కళాభివృద్ధికి వినియోగించాలి



కొంతమంది సీనియర్ కళాకారుల స్వార్థ రాగద్వేషాలు తెలుగు నాటకరంగాన్ని దెబ్బతీశాయి. పరిషత్ నిర్వాహకుల చేతుల్లోంచి నియంత్రణ జారిపోవడం, రంగస్థల అభివృద్ధికి పెద్ద అవరోధం. తమ రంగస్థల ప్రయాణాన్ని విశ్లేషించుకుని, నాటక అభివృద్ధికి నిజమైన కృషి చేసే పరిషత్‌లకు బాధ్యతలు అప్పగించేందుకు సీనియర్ కళాకారులు, నిర్వాహకులు, న్యాయనిర్ణేతలు ముందుకు రావాలి. నాటక వేదికలను స్వార్థానికి కాకుండా, కళాభివృద్ధికి ఉపయోగించాలి.

– గోపరాజు విజయ్, సినీ, రంగస్థల నటుడు, తెనాలి

యార్డుకు 1,18,783 బస్తాలు మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,18,783 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,05,617 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,200 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,200 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 64,366 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

క్లుప్తంగా

హత్య కేసును విచారించిన జిల్లా ఎస్పీ

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణం మారుతీనగర్‌లో సోమవారం జరిగిన హత్య కేసు విచారణ నిమిత్తం పల్నాడు జిల్లా కె.శ్రీనివాసరావు సోమవారం హాజరయ్యారు. తొలుత ఆదిలక్ష్మి హత్యకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి మృతదేహాన్ని పడేసిన క్వారీని గుంతను పరిశీలించారు. అనంతరం పట్టణ పోలీసు స్టేషన్‌కు చేరుకుని, హత్యకు సంబంధించి పూర్తి వివరాలు సీఐ శ్రీరామ్ వెంకట్రావును అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కొత్త కవులను ప్రోత్సహిద్దాం


రచయిత్రి నివాసంలో సమావేశమైన కవులు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): స్థానిక బ్రాడీపేటలోని కథా రచయిత్రి తాటికోల పద్మావతి నివాసంలో గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కవులందరూ కలిసి 'కవిత్వంతో కాసేపు' నిర్వహించారు. ఈనెల 21 న అంతర్జాతీయ కవితా దినోత్సవం, 30న ఉగాది పండుగ సందర్భంగా కవిత్వంపై చర్చించారు. ఔత్సాహిక కవులను ప్రోత్సహించడమే లక్ష్యంగా సంఘం పని చేద్దామని సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం.సుభాని తెలిపారు. కవులు తాము రాసిన కవితతోపాటు సమకాలీన కవులు రాసిన, తమకు నచ్చిన మరో కవిత వినిపించి జయప్రదం చేశారని కోశాధికారి నానా చెప్పారు. సంఘానికి కొత్తగా పరిచయమైన కవులు మెట్టు శ్రీనివాసరెడ్డి, సురేష్, కడంశెట్టి సతీష్‌కుమార్ మాట్లాడారు. ఇది కవి సంగమం అని, సత్సంగమని, అందరూ మర్యాద పూర్వకంగా కలవడం సంతోషంతో పాటు ప్రోత్సాహాన్నిచ్చిందని పేర్కొన్నారు. రచయిత్రి తాటికోల పద్మావతి ఆతిథ్యం, ఆప్యాయతలను కవులు కొనియాడారు. సంఘం ఉపాధ్యక్షులు బొమ్ము ఉమామహేశ్వర రెడ్డి, సభ్యులు ఈవూరి వెంకట రెడ్డి, కొణతం నాగేశ్వరరావు, శ్రీవశిష్ట సోమేపల్లి పాల్గొన్నారు.

మోసపోయాం.. న్యాయం చేయండి

- పోలీసు పీజీఆర్‌ఎస్‌లో బాధితుల మొర
- 80 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు


జిల్లా పోలీసు కార్యాలయంలో బాధితుల సమస్యలు వింటున్న జిల్లా ఎస్పీ

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పోలీసు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులచే కుటుంబ, ఆస్తి, చోరీలు, మోసాలకు చెందిన 80 ఫిర్యాదులు స్వీకరించారు.

క్రెడిట్ కార్డుకోసం ఫోన్‌చేసి మోసం..

నేను పట్టణంలోని ఒక చిన్న ఫైనాన్స్ కంపెనీలో చిరుద్యోగిగా పనిచేస్తున్నాను. ఓ అజ్ఞాత వ్యక్తి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నుంచి క్రెడిట్ కార్డు కావాలా అంటూ కాల్ చేశాడు. నాకు అవసరంలేదని చెప్పాను. జనవరి 21వ తేదీన ఓ వ్యక్తి బ్యాంకు క్రెడిట్ కార్డు నుంచి కాల్ చేస్తున్నట్లు చెప్పగా ఆ కాల్ కట్ చేశాను. తరువాత నా వాట్సాప్‌కు ఒక లింక్ పెట్టగా తెలియక ఆ లింక్ ఓపెన్ చేశా. ఆ తర్వాత నా ఫోను ఆ అజ్ఞాత వ్యక్తి కంట్రోల్ లోకి వెళ్లింది. నా బ్యాంకు అకౌంట్ ద్వారా నగదు లావాదేవీలు చేశాడు. అతనిపై సైబర్ క్రైం ద్వారా ఎఫ్ఐఆర్ నమోదు చేసి శిక్షించండి.

– బొడ్డపాటి వెంకటేశ్వరరావు, అల్లూరివారిపాలెం, నరసరావుపేట మండలం

ఉద్యోగం ఇప్పిస్తానని రూ.20లక్షలు మోసం

నాకు 2019లో వాంకడావత్ వసంతరావు నాయక్ అనేవ్యక్తి ఎంపీడీఓగా పరిచయమై ప్రస్తుతం ప్రకాశం జిల్లా పుల్లల చెరువు మండలంలో పనిచేస్తున్నట్లు నమ్మబలికాడు. నా మరదలు కుమారుడైన చింత దానయ్యకు ఉద్యోగం ఇప్పిస్తామని దానికి గాను సుమారు రూ.20లక్షలు వరకు ఖర్చు అవుతుందని, ఆ డబ్బులు ఇస్తే పంచాయతీరాజ్ విభాగంలో ఉద్యోగం ఇప్పిస్తానని, ముందు డబ్బులు ఇస్తే తాను ప్రిన్సిపల్ సెక్రెటరీ దగ్గర నుంచి కలెక్టర్ దాకా డబ్బులు ఇచ్చుకుంటూ రావాలని ఆ తర్వాత ఉద్యోగం వస్తుందని చెప్పి రూ.20లక్షలు తీసుకున్నాడు. ఇప్పటికి ఆరేళ్లు గడిచినా ఉద్యోగం ఇప్పించకుండా, డబ్బులు ఇవ్వకుండా మోసం చేసి డబ్బులు అడిగితే చంపుతానని బెదిరిస్తున్నాడు. తగిన న్యాయం చేసి, మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి శిక్షించండి.

– భీముని వెంకటరావు, వినుకొండ

యాడ్ ఏజెన్సీ పేరుతో రూ.33లక్షలు కాజేశాడు

నేను ఓఎల్‌ఎక్స్ వెబ్‌సైట్‌లో కెమెరా రోజువారీ అద్దెకు ఇస్తానని పెట్టగా, సెప్టెంబర్ నెలలో కంద్రిక గ్రామానికి చెందిన సాగర్‌బాబు ఆన్‌లైన్‌లో పరిచయమై మీ కెమెరాను నేను అద్దెకు ఇప్పిస్తానని, తాను సినిమాలకు స్క్రిప్టులు రాస్తానని, నాకు జబర్దస్త్ ప్రోగ్రాం వారు కూడా తెలుసునని, తాను అందులో పనిచేస్తున్నానని నమ్మబలికాడు. ఇద్దరం కలిసి యాడ్ ఏజెన్సీ పెడదామని చెప్పి నా వద్ద నుంచి రూ.33లక్షలు ఆన్‌లైన్ చేయించుకున్నాడు. ఆ తర్వాత అతడి నుంచి స్పందన లేకపోవటంతో మోసపోయానని గ్రహించి పెద్ద మనుషులను తీసుకొని అతను వద్దకు వెళ్లగా డబ్బులు తీసుకున్న మాట నిజమేనని ఒప్పుకొని నెలకు రూ.50వేలు ఇస్తాని ఒప్పుకొన్నాడు. ఇప్పటివరకు ఒక్క పైసా ఇవ్వకుండా తప్పించుకుతిరుగుతున్నాడు. గట్టిగా అడిగితే తిరిగి నాపైనే ఎస్సీ ఎస్టీ కేసు పెడతానని బెదిరిస్తున్నాడు. అతడిపై చర్యలు తీసుకొని నా డబ్బులు నాకు ఇప్పించండి.

– రెడ్డిమాసు దిలీప్‌కుమార్, రావిపాడు, నరసరావుపేట మండలం

విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రం ప్రారంభం


చెల్లింపు కేంద్రాన్ని ప్రారంభించి, మాట్లాడుతున్న జిల్లా విద్యుత్ ఎస్ఈ పత్తిపాటి విజయ్ కుమార్

మాచర్ల: పట్టణంలో విద్యుత్ బిల్లులు మొదటి అంతస్తుకు వెళ్లి చెల్లించే పనిలేకుండా గ్రౌండ్ ఫ్లోర్‌లోనే విద్యుత్ బిల్లుల చెల్లింపు సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పల్నాడు జిల్లా విద్యుత్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ (ఎస్ఈ) డాక్టర్ పత్తిపాటి విజయ్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ బిల్లుల చెల్లింపు సేవా కేంద్రాన్ని ఈఈ సింగయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు ఇబ్బంది పడకుండా గ్రౌండ్ ఫ్లోర్‌లోనే విద్యుత్ బిల్లులు చెల్లించేలా ఏర్పాట్లు చేశామన్నారు. సీనియర్ అకౌంటెంట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఏడీఏ రామయ్య, ఏఈ కోటేశ్వరరావు, పలు మండలాల ఏఈలు పాల్గొన్నారు. అనంతరం డివిజనల్ పరిధిలో 9 మండలాలకు చెందిన డీఈలు, ఏఈలు, అసిస్టెంట్ ఇంజినీర్లు, అకౌంటెంట్ ఆఫీసర్లుతో ఎస్ఈ పి.విజయ్‌కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

పీటీ వారెంట్‌పై నరసరావుపేట కోర్టుకు బోరుగడ్డ

- ఈ నెల 3న ఫిరంగిపురంలో కేసు నమోదు
- రాజమండ్రి జైలు నుంచి నరసరావుపేట కోర్టుకు హాజరు
- వచ్చే నెల 4వ తేదీవరకు రిమాండ్


పోలీస్ వాహనంలో బోరుగడ్డ అనిల్

నరసరావుపేటటౌన్: బోరుగడ్డ అనిల్‌ను ఫిరంగిపురం పోలీసులు పీటీ వారెంట్‌పై నరసరావుపేట కోర్టులో సోమవారం హాజరు పరిచారు. అనిల్‌పై ఫిరంగిపురం పోలీసులు ఈ నెల 3వ తేదీన కేసు నమోదు చేశారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న అతన్ని పీటీ వారెంట్‌పై పట్టణానికి తెచ్చి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, ఏప్రిల్ 4 వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లను సామాజిక మాధ్యమాల్లో దూషించాడని ఫిరంగిపురంకు చెందిన తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ ఎంపీపీ అన్నమ్మ భర్త పెరికల లూర్దయ్య ఈ నెల 3వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు 351(1),351(2), 351(4),352, 356(2),79 బీఎన్ఎస్, 67 ఐటీఏ-2000-2008 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

పొగాకు తగలబెట్టి నిరసన తెలిపిన రైతులు

నల్లబర్లీ పొగాకు వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్


పొగాకు తగలబెట్టి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

జే.పంగులూరు: నల్లబర్లీ పొగాకు వెంటనే కొనుగోలు చేయాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రైవేటు కంపెనీలు నల్లబర్లీ పొగాకు కొనుగోలు చేయకపోవడం.. ప్రభుత్వం కూడా రైతులను పట్టించుకోకపోవడంతో నిరసనగా పంగులూరు బస్టాండ్ సెంటర్‌లో సోమవారం రైతులు పొగాకు పంటను తగులబెట్టి నిరసరన తెలిపారు. రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ నల్లబర్లీ కొనుగోలు చేస్తాం సాగు చేయండని రైతులను ప్రోత్సహించి సాగుచేయించిన ప్రైవేటు కంపెనీలు ఇప్పుడు మొహం చాటేశాయని, కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి రైతులు, కౌలు రైతులు సాగు చేస్తే కంపెనీలు కొనుగోలు చేయకపోవడం దారుణమన్నారు.

నిమ్మకు నీరెత్తినట్లుగా కూటమి ప్రభుత్వం

నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయకుండా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తిన్నట్లు ఉందన్నారు. గత సంవత్సరం పొగాకు పంట లాభాలు దృష్ట్యా రైతులు ఎక్కువగా ఆ పంట వేసేందుకు మక్కువ చూపారని, బాపట్ల జిల్లాలోని పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల పరిధిలో లక్షల ఎకరాల్లో సాగు చేశారన్నారు. దానికి తోడు నల్లబర్లీ ఎక్కువగా సాగు చేశారని అన్నారు. బర్లీ పొగాకును కూడా బోర్డు పరిధిలోకి తీసుకొని కొనుగోలు చేయాలన్నారు. ఈ విషయంపై ఇప్పటికే కలెక్టర్‌ను, ప్రైవేటు కంపెనీల యాజమాన్యాలను కూడా కలిశామన్నారు. వెంటనే పొగాకు పంటను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిణి వినోద్‌బాబు, మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా.. ఇంతవరకు తమ వేతనాలు పెంచలేదని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ ధ్వజమెత్తారు. పాతగుంటూరులోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం జిల్లా అధ్యక్షురాలు ఏవీఎన్ కుమారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వేతనాలు పెంచకపోగా ఉద్యోగుల పేరుతో కరెంట్ బిల్లులు పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్లు హెల్పర్‌లు అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ ఇస్తామని మోసం చేశారని పేర్కొన్నారు. సమావేశంలో అంగన్‌వాడీల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులుగా వై.రమణను గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దీప్తి, ఉపాధ్యక్షులు సుకన్య, ధనలక్ష్మి, హేమలత, రాజకుమారి, శివ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి


నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు

ఆక్టా రాష్ట్ర అధ్యక్షుడు మోహనరావు

నరసరావుపేట ఈస్ట్: దేశవ్యాప్తంగా అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ, కాలేజ్ టీచర్స్ ఆర్గనైజేషన్ పిలుపులో భాగంగా సోమవారం శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఎయిడెడ్ అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆర్గనైజేషన్ 33వ కాన్ఫరెన్స్ తీర్మానం మేరకు ఈనెల 24, 25, 26 తేదీలల్లో అధ్యాపకులు తమ డిమాండ్ల సాధనకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్నట్టు ఆక్టా రాష్ట్ర అధ్యక్షుడు కోండ్రు మోహనరావు తెలిపారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనీ, ఎన్ఈపీ-2020 ఉపసంహరించుకోవాలని కోరారు. ఎయిడెడ్ కళాశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఆక్టా నాయకులు డాక్టర్ ముద్దా రమేష్, డాక్టర్ ఐ.సదాశివరెడ్డి, డాక్టర్ పీఎస్‌వీడీ మహేష్, డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డాక్టర్ భానునాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మందులు, పౌష్టికాహారంతో క్షయ వ్యాధి దూరం

డీఎంహెచ్ఓ డాక్టర్ రవి


అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్ఓ డాక్టర్ రవి, వైద్యులు, సిబ్బంది

నరసరావుపేటటౌన్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఏరియా వైద్యశాలలో క్షయ అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ రవి మాట్లాడుతూ టీబీ అంటు వ్యాధి అన్నారు. టీబీకి ప్రస్తుతం చాలా మంచి మందులు అందుబాటులోకి వచ్చాయన్నారు. రెండు వారాల పాటు దగ్గు, జలుబు ఉండి తగ్గకపోతే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ వైద్యశాల్లో సంప్రదించాలన్నారు. టీబీ ఉన్నట్లు నిర్ధారణ అయితే ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందన్నారు. పల్నాడు జిల్లాలో 1500 కేసులు ఉన్నాయన్నారు. పోషణ కోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ.1000 అందజేస్తుందన్నారు. అదేవిధంగా ప్రతి నెలా పౌష్టికాహారం కూడా అందజేస్తున్నామన్నారు. డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ హనుమకుమార్, డాక్టర్ మంత్రునాయక్, డాక్టర్ గీతాంజలి పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

డాక్టరు జీ.వి.రామాంజనేయులు


మాట్లాడుతున్న జి.వి.రామాంజనేయులు

బాపట్ల: వ్యవసాయ రంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవటం వలనే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ డైరెక్టర్ డాక్టర్ జి.వి.రామాంజనేయులు పేర్కొన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాల్లో ఆర్థిక శాస్త్ర విభాగం నిర్వహించిన సమావేశంలో డాక్టరు జి.వి.రామాంజనేయులు మాట్లాడారు. ప్రభుత్వం వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికై చేపట్టిన విధానాల రైతులకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు ప్రభుత్వ విధానాల పట్ల స్పష్టమైన అవగాహన కలిగివుండాలన్నారు. హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సీహెచ్.శ్రీనివాసరావు మార్క్‌ఫెడ్ రంగం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. డెయిరీ, ఫిషరీస్ వంటి వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికై ప్రభుత్వ నూతన విధానాలను కూలంకషంగా వివరించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనరాణి, ఆర్థిక శాస్త్ర విభాగ ప్రొఫెసర్లు డాక్టర్ కె.ఎస్.పాల్, డాక్టర్ ఎస్.హైమజ్యోతి, డాక్టర్ కె.సుశీల, డాక్టర్ బి.అపర్ణ, డాక్టర్ వి.సీతారాంబాబు, 200 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కేవీకేలో శాస్త్రీయ సలహా మండలి సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌వీవీ వర్సిటీ ఉపకులపతి జేవీ రమణ

గుంటూరు రూరల్: శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ సలహా మండలి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సోమవారం నగర శివారుల్లోని లాం ఫాంలోని కేవీకేలో ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ ఎం.యుగంధర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. పశు విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ జేవీ రమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశోధనశాలల్లో రూపుదిద్దుకుంటున్న సాంకేతికతను రైతులకు చేరవేయటంలో కృషివిజ్ఞాన కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. వివిధ రంగాల్లో శిక్షణ, నైపుణ్యాల వృద్ధి కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి గ్రామీణ యువతకు వ్యవసాయం, అనుబంధ రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ శారదజయలక్ష్మిదేవి మాట్లాడుతూ శాస్త్రీయ సలహా మండలి సూచనలు, సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందించాలని అభిప్రాయపడ్డారు. ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గేదెల యాజమాన్య పద్ధతులపై కేవీకే కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ బి. శోభామణి, డాక్టర్ శివన్నారాయణలు క్షేత్రస్థాయి పరిశీలనలు, సూక్ష్మ సమన్వయంతో నిర్వహించేట్లు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు నరసింహారావు, ఎల్ఆర్ఎస్ హెడ్ డాక్టర్ ముత్తారావు వ్యవసాయ, అనుభంద సంస్థల నిపుణులు వారి సలహాలను అందించారు. కేవీకే శాస్త్రవేత్తలు 2024-25 సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. 2025-26 సంవత్సరంలోని కార్యాచరణ ప్రణాళికలను వివరించారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్‌కుమార్ మాట్లాడుతూ సలహా మండలి సలహాలు సూచనలు పాటిస్తూ భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, ఎల్ఆర్ఎస్ సిబ్బంది, రైతులు, శాస్త్రవేత్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం


లక్ష్మీభార్గవి మృతదేహం

యడ్లపాడు: వివాహిత అనుమానస్పదంగా మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ వి.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బోయపాలెంకు చెందిన వడ్డేపల్లి అశోక్‌కు గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఇరిపని లక్ష్మీభార్గవి (23)కు 2018లో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అశోక్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుండగా, భార్గవి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం సుమారు 5.30 గంటల సమయంలో ఇంట్లోకి వెళ్లి తలుపు వేసుకుంది. ఎంతకు తీయకపోవడంతో అనుమానంతో ఆమె ఆడపడుచు తలుపుకొట్టి తీసి చూడగా రేకుల షెడ్డు పైకప్పుకు వేసి ఐరన్‌రాడ్డుకు చీరెతో ఉరివేసుకుని కన్పించింది. పెద్దగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వచ్చి చూడగా అప్పటికే లక్ష్మీభార్గవి మృతి చెందినట్లు గుర్తించారు. మృతురాలి ఆడపడుచు భర్త బాలాజీ ద్వారా విషయం తెలుసుకున్న మృతిరాలి తల్లి దుర్గ సోమవారం బోయపాలెం చేరుకుంది. విగతజీవిగా మారిన కుమార్తెను చూసి కన్నీరు మున్నీరుగా విలపించింది. వెంటనే బంధువులతో కలిసి యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు తెలుసుకుని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించి, మృతదేహాన్ని సోమవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే ఏడాది నుంచి భార్గవికి కడుపు నొప్పి వేధిస్తుందని, దానిని తాళలేక మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్గవి తల్లి తన ఫిర్యాదు పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. మృతికి సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

అప్పులు కట్టలేక భార్యాభర్తల అదృశ్యం

అద్దంకిరూరల్: అప్పులు కట్టలేనని.. ఇంట్లో పుస్తకంలో రాసిపెట్టి భార్యాభర్తలు అదృశ్యమయ్యారు. ఈఘటన ఆదివారం అద్దంకి పట్టణంలో జరగ్గా భార్య, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు ఎస్ఐ ఖాదర్‌బాషా నమోదు చేశారు. ఎస్సై వివరాల మేరకు అద్దంకి పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన కుంచాల శ్రీనివాసరావుకు ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. వీరిలో పెద్ద కుమార్తె అంజలికి మూడేళ్ల కిందట ఆలకుంట వెంకట్రావుతో వివాహం కాగా అద్దంకిలో ఉంటున్నారు. వెంకట్రావు బేల్దారి పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ప్రస్తుతం అంజలి గర్భిణి. ఈ క్రమంలో ఆదివారం తల్లి తన కుమార్తె అంజలి ఇంటికి వెళ్లగా ఇంట్లో ఎవరూ కనిపించలేదు. దీంతో కూతురు, అల్లుడు హాస్పటల్‌కు వెళ్లారని భావించి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ అని వచ్చింది. వెంటనే అద్దంకిలోని వైద్యశాలలో చూశారు. అక్కడా కూడా లేకపోవడంతో ఒంగోలులోని పలు వైద్యశాలలు వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో ఇంటికి వచ్చి అన్ని వెతకగా ఒక పుస్తకంలో తాము ఇవ్వాల్సిన అప్పుల జాబితా రాసి ఉంది. 'అవి తాను కట్టలేనని తన ఇల్లు అమ్ముకుని అందరూ తీసుకోవాలని రాసి, తమకోసం వెతకవద్దు ఎవరికి కనబడం ' అని ఉంది. బంధువుల వద్ద అడగ్గా తమవద్దకు రాలేదని చెప్పారు. అద్దంకిలోని గుండ్లకమ్మ నది ప్రాంతం అంతా వెతికారు. అయినా జాడ కనబడలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్యను హత్యచేసిన వ్యక్తికి జీవిత ఖైదు

చినగంజాం: భార్యను హత్యచేసిన కేసులో వ్యక్తికి కోర్టు జీవిత ఖైదు విధించింది. పోలీసులు సమాచారం మేరకు బాపట్ల జిల్లా చినగంజాంలోని మహాలక్ష్మి కాలనీకి చెందిన కత్తి శ్రీనుకు తన భార్య కత్తి దుర్గ(30)తో మనస్పర్థలు వచ్చాయి. భర్తతో విభేదించి ఆమె పుట్టింటికి వచ్చింది. తల్లిదండ్రులు మల్లవరపు అంజయ్య, రాఘవమ్మ ఇంట్లో తన పిల్లలతో ఉంటోంది. ఈ గొడవలు మనసులో పెట్టుకున్న శ్రీను గతేడాది జూన్‌లో దుర్గ ఉంటున్న ఇంటికెళ్లి కత్తితో విచక్షణారహితంగా దాడి చేయడంతో ఆమె ఘటనా స్థలంలోనే చనిపోయింది. మృతురాలి తల్లి మల్లవరపు రాఘవమ్మ ఫిర్యాదు ఆధారంగా అప్పటి ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ బత్తుల శ్రీనివాసరావు దర్యాప్తు చేసి నిందితుడిని రిమాండుకు పంపారు. ఇప్పటి సీఐ వై.వి.రమణయ్య దర్యాప్తు పూర్తి చేసి నివేదికను కోర్టుకు సమర్పించారు. అనంతరం అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంతి కుమారి వాదనలతో ఏకీభవించిన ఒంగోలు మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి డి.రాములు నిందితుడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.1600 జరిమానా విధించారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్ చేస్తాం

- ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా
- ఎస్పీ తుషార్ డూడీ



బాపట్లటౌన్: బెట్టింగ్‌లకు పాల్పడితే రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆన్‌లైన్‌లో రోజుకొక రకమైన బెట్టింగ్ యాప్‌లు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. వివిధ ఆఫర్స్‌తో బెట్టింగ్ ఫ్రీ అంటూ యువతను ఆకర్షించి వారి జీవితాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. ఒకసారి ఆడి చూద్దాం అని సరదాగా మొదలు పెట్టి వీటి బారిన పడిన యువకులు బయటికి రావడమనేది కష్టతరమైన విషయమన్నారు. ఈ బెట్టింగ్స్‌కి అలవాటు పడ్డ వాళ్లు అప్పుల పాలు కావడమే కాకుండా.. చేసిన అప్పులు తీర్చలేక చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆన్‌లైన్ బెట్టింగ్‌పై నిఘా ఉంచామన్నారు. బెట్టింగ్ ముఠాలు రేపల్లె, చీరాల, అద్దంకి వంటి మరికొన్ని ప్రదేశాల్లో వారి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. దానికి అనుగుణంగా గతంలో బెట్టింగ్‌లు నిర్వహిస్తూ వివిధ పోలీస్ స్టేషన్లలో పట్టుబడిన 39 మంది కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. చీరాల-1 టౌన్‌లో రెండు కేసుల్లో 11 మంది, రేపల్లె టౌన్‌లో ముగ్గురు, వేమూరు పోలీస్‌స్టేషన్‌లో ఆరుగురు, కొల్లూరులో ఒకరు, చీరాల టూ టౌన్‌లో ఒకరు, వేటపాలెంలో 9 మంది, అద్దంకిలో 8 మందిని అరెస్ట్ చేశామన్నారు. బెట్టింగ్‌లకు పాల్పడే అవకాశం ఉన్న వారిపై నిఘా ఉంచామన్నారు.

29న బాజీబాబా దర్గా ఉరుసు మహోత్సవం

పెదకాకాని: బాజీబాబా దర్గా ఉరుసు మహోత్సవం మార్చి 29, 30 తేదీలలో నిర్వహిస్తున్నట్లు దర్గా ఈఓ షేక్ ముక్తార్‌బాషా తెలిపారు. గుంటూరు జిల్లా పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గా 537వ ఉరుసు మహోత్సవం పురస్కరించుకుని సోమవారం ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ చేతుల మీదుగా పోస్టర్లు ఆవిష్కరించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించే ఉరుసు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని ఎమ్మెల్యే చెప్పారు.